www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 24 ఆగస్టు 2023



అంబేద్కర్ స్టడీ సర్కిల్ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

నల్లమిల్లిలో నిరుపయోగంగా ఉన్న డాక్టర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ను వినియోగంలోకి తీసుకురావాలని పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతి రావు డిమాండ్ చేశారు. స్టడీ సర్కిల్ భవనాన్ని బుధవారం తిరుపతిరావు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ వెనకబడి ఉన్న దళిత బడుగు బలహీన వర్గాల నిరుపేద నిరుద్యోగులకు ఉద్యోగాలు ఉపాధి సాధించే విధంగా శిక్షణ ఇచ్చేందుకు 2018లో స్టడీ సర్కిల్ ప్రారంభించారని చెప్పారు. అప్పటి నుండి కనీసం ఒక్క నిరుద్యోగికి కూడా ఉపాధి కల్పించే విధంగా శిక్షణ ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల స్టడీ సర్కిల్ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. వెంటనే స్టడీ సర్కిల్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

కోత బారిన లంక భూములు

దిక్కు తోచని రైతాంగం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

పచ్చటి తివాచీ పరిచినట్లుగా కనపడే సారవంతమైన లంక భూములు ఏట నదిలో కలిసిపోవడంతో రైతులు కుంగిపోతున్నారు. ఉన్న కొద్దిపాటి భూములు కూడా నది ప్రవాహానికి అందులూ విరిగిపోయి నదిలో కలిసిపోతుంటే ఏమీ చేయని పరిస్థితుల్లో నిస్సహాయంగా చూస్తున్నారు. ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాలలో గౌతమీ నది కుడి ఎడమ వశిష్ఠ నది ఎడమ పక్క ఉన్న వందలాది ఎకరాల లంక భూములు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. గోదావరి ఉధృతికి 1000 ఎకరాలపై లంక భూములు కోతకు గురై వరదలు వచ్చినప్పుడు లంక భూములలో పంపుసెట్లు, చెట్లు, పశువుల పాకలు, మోటారు షెడ్లు నదిలో కలిసిపోవడం పరిపాటి అయిపోయింది. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం, పులిదిండి, వెలిచేరు, రాజవరం, వసంతవాడ, తాడిపూడి, నార్కెడిమిల్లి, అంకంపాలెం, వాడపల్లి, పులిదిండి, మద్దంపాలెం, ర్యాలి, పోలవరం, పొడగట్లపల్లి, వాడపల్లి, బడుగు వాని లంకలు తదితర చోట్ల లంక భూములు కోతకు గురై ఎక్కువగా నదీ గర్భం కలిసిపోతున్నాయి. కోనసీమ ముఖద్వారం వశిష్ట నది బ్యారేజీ చెంత వరదల సమయంలో లంక కోత అధికంగా ఉంటోంది. అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకోవాలని లంక రైతులు కోరుకుంటున్నారు. పడిపర్రు, ఆత్రేయపురం, వెద్దేరు, పేరవరం, వాడపల్లి, మెర్లపాలెం, పేరవరం తదితర చోట్ల ఏటిగట్టును అభివృద్ధి పరచకుండా అలాగే వదిలేయడంతో వరదల సమయంలో ఆ గ్రామాల వాసులు ఎప్పుడు ఏం ప్రమాదం వస్తుందని భయాందోళన చెందుతున్నారు. లంక పొలాలు నదీగర్భంలో కలిసిపోకుండా ఉండాలంటే రాతి కట్టుబడే శరణ్యం అంటున్నారు. పంట పొలాలు నదీగర్భంలో కలిసిపోకుండా గతంలో పేరవరం, బొబ్బర్లంక వంటి పలుచోట్ల గ్రోయిన్స్ నిర్మించడంతో కొంతవరకు లంక భూములు కోతకు ఇది కాకుండా నివారించగలిగారు. సంబంధిత అధికారులు ప్రణాళికను రూపొందించి రక్షణ చర్యలు చేపడితే లంక భూములు నదీ గర్భంలో కలిసిపోకుండా ఉంటాయని లంక పొలాల రైతులు కోరుకుంటున్నారు.


కోతకు గురైన లంక భూమి


నదీగర్భంలో కలిసిపోతున్న పొలం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాము

లంక భూములు నదీ గర్భంలో కలిసిపోకుండా రాతి కట్టడాలతో పాటు అడ్డుకట్టలు వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించాం అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాము.

ఎం.శివప్రసాద్, హెడ్ వర్క్స్ ఎఇ.

ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా రూపకల్పనకై ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణను నాణ్యతతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి సర్వే నాటికి నూరు శాతం పూర్తయిందని, ఆన్లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియ 98 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఓటర్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఎన్నికల సంఘం నిబంధనలకు తూచా తప్పకుండా పాటిస్తూ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి దశలో ఓటర్లకు సమాన అవకాశాలు కల్పిస్తూ అత్యంత జవాబుదారీతనంతో జాబితా రూపకల్పనకు పటిష్టమైన చర్యలు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,300 ఓటర్ల చిరునామాలు మారాయని, వీరు ఏ అడ్రస్లో నివాసం ఉంటున్నారో తెలిపితే అక్కడ మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పిస్తామన్నారు. వేరే చిరునామాలను తొలగించేందుకు పోస్టు ద్వారా నోటీసులు అందిస్తామన్నారు. 26,209 ఓటర్లు మరణించినట్లు ఇప్పటి రకూ గుర్తించినట్లు వీరిని ఫారం -7 ద్వారా తొలగించడానికి నోటీసులు అందించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 1,728 మంది, ఓటర్ల పేర్లు రిపీట్ అయ్యాయని వీరు ఓట్లు ఎక్కడ ఉండాలో నోటీస్ ద్వారా తెలుసుకొని మిగిలిన చోట్ల వీరిని ఫామ్ -7 ద్వారా తొలగించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 5,263 మంది ఓటర్లను అబ్సెంట్లుగా గుర్తించామని తెలిపారు. ఈ ప్రక్రియలో అన్ని ఎక్సర్ సైజులు ముగిసిన పిమ్మట ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 1500 మించి ఓటర్లు ఉన్నట్లయితే వీరికోసం మరొక పోలింగ్ స్టేషన్ ప్రతిపాదిస్తామన్నారు. గతంలో తొలగించిన ఓటరు జాబితాపై రీ వెరిఫికేషన్ చేసి అర్హులు ఎవరైనా ఉంటే వారికి ఫామ్ 6 ద్వారా ఓటరుగా అవకాశం కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు ఓటరుగా నమోదుకు 12000 దరఖాస్తులు అందాయన్నారు. సెప్టెంబర్ 20 నాటికి పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రక్రియపై కార్యాచరణ ముగించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, నాయకులు పి.ఉదయ భాస్కర్, కె.శ్రీనివాసరావు, ఆర్డి.ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ధాన్యానికి కనీస మద్దతు ధరకు చర్యలు


ప్రజాశక్తి-అమలాపురం

ఖరీఫ్ సీజన్కు సంబంధించి రైతాంగానికి కనీస మద్దతు ధర కల్పన కోసం మిల్లర్ల సమన్వయంతో పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నూపూర్ అజయ్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు సన్నద్ధత, ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణపై జిల్లా వ్యవసాయాధికారి, తూనికలు కొలతలు అధికారి పౌర సరఫరాల జిల్లా మేనేజర్, జిల్లా సహకార అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, వ్యవసాయ మార్కెటింగ్ సహాయ సంచాలకులు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జిల్లారవాణా అధికారి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణ కేంద్రాల పటిష్ట నిర్వహణపై దృష్టి సారించాలని, ముఖ్యంగా రైతు భరోసా కేంద్రం, మిల్లుల వద్ద తేమ శాతాల్లో వ్యత్యాసాలు లేకుండా చూసేందుకు ఒకేవిధమైన యంత్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రాప్లో 1,53,454 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నమోదైనట్టు చెప్పారు. గోనె సంచులు రైతుల డిమాండ్కు అనుగుణంగా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోనెసంచెలను మిల్లర్ల వద్ద నుండచి సేకరించి రొటేషన్ పద్ధతిలో రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ధాన్యం సేకరణపై పూర్తి అవగాహన రైతులలో కల్పించే దిశగా వివిధ కరపత్రాలు ముద్రించి ప్రచార కార్యక్ర మాలు చేపట్టాలని సూచించారు. నవంబర్ మొదటివారం నుంచి ఖరీఫ్ దిగుబడులు మార్కెట్లోకి రానున్నాయని ఈ లోపుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో నిర్వహణకు సన్నద్ధం చేయాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి రిజిస్టర్ రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లింగ్ కెపాసిటీ కనుగుణంగా లక్ష్యాలు నిర్ధేశించాలని సూచించారు గతేడాది ధాన్యం సేకరణలో ఉత్పన్నమైన సమస్యలు పునరావృతం కాకుండా పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. రవాణా శాఖ అధికారులు ధాన్యం రవాణా కోసం ఏజెన్సీలను ఎంపిక చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఉత్పన్నమైన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో తేమశాతం కొలిచే పరికరాలను సిద్ధం చేయాలన్నారు. ఎక్కడా ఫిర్యాదులు ఉత్పన్నం కాకుండా అధికారి యంత్రాంగం ధాన్యం సేకరణ విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.81.59 లక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ముఖ మండపంలో ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం ఇఒ ఎం.రాధాకృష్ణ, ఎన్వివిఎన్వి.ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో లెక్కించారు. 28 రోజులు కాలానికి రూ.81 లక్షలు 59 వేలు, 16 గ్రాముల బంగారం, 803 గ్రాముల వెండి విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయి. విశ్వేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.2 లక్షలు సమకూరింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు, సర్పంచ్ పోచిరాజు బాబూరావు, ధర్మకర్తలు శనగల సత్యనారాయణ, మెర్ల వెంకటేశ్వరరావు, మన్యం భాను, ఏపుగంటి కనకారావు, రొట్టె రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సమస్యలపై పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-కాట్రేనికోన, ఐ.పోలవరం

ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులకు బుధవారం వినతిపత్రం అందించారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించడంలో సానిటేషన్ కార్మికుల పాత్ర కీలకమైనదని, సమాజంలో అట్టడుగున ఉన్న పేదవర్గాలు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారన్నారు. సానిటేషన్ కార్మికులకు అతి తక్కువ వేతనాలతో ఎక్కువ పని గంటలు చేయిస్తున్నారన్నారు. దాదాపు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్కూల్ ఆవరణలోనే ఉండాల్సి వస్తోందన్నారు. కనీస వేతనం అమలు చేయడం లేదని, ఒకపక్క నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోతున్నా జీతం మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రతి నెలా 5వ తేదీకి వేతనం అందేలా చూడాలని, గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం, యూనిఫామ్ అందజేయాలని, తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట లక్ష్మి, అనంతలక్ష్మి, భవానీ, సత్యవతి పాల్గొన్నారు. ఐ.పోలవరంలో విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు మండల కన్వీనర్ టి.నాగలక్ష్మి మాట్లాడారు. భవాని, లక్ష్మీదేవి, సత్యవతి, మంగయమ్మ పాల్గొన్నారు.


సమస్యలపై పారిశుధ్య కార్మికుల వినతి

పంట కోత ప్రయోగంపై శిక్షణ

మండపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, ఆర్థిక గణాంక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రైతులకు అందిస్తున్న ఇన్సూరెన్స్కు సంబంధించిన పంటకోత ప్రయోగంపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఒ పి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఆలమూరు ఎడి కె.నాగేశ్వరరావు పంట కోత ప్రయోగం ఎన్ని సెంటీమీటర్లలో ఏ విధంగా చేపట్టాలి, ఏవిధంగా లెక్కించాలనే అంశాలను వివరించారు. ఎడి ఎం.మురళీకృష్ణ హాజరయ్యారు.

సుబ్బారావు కుటుంబానికి పరామర్శ

మండపేట : ఇటీవల మరణించిన మండలంలోని జెడ్.మేడపాడు మాజీ సర్పంచ్ సంగిశెట్టి సుబ్బారావు కుటుంబాన్ని సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్ బుధవారం పరామర్శించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాగేశ్వరరావు, వడ్డి రాజు, మంగరాజు ఉన్నారు.

వరి పొలాల ముంపు పరిశీలన

మండపేట : చేలలోని నీరు దిగకపోవడంతో తమ పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని మండలంలోని జడ్.మేడపాడు గ్రామానికి చెందిన రైతులు సోమవారం స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులు ముంపు ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. జెఇ రజని మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళతానన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు అధికారులను కోరారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

ఉప్పలగుప్తం : విలసవిల్లిలో మరణించిన వ్యక్తి కుటుంబానికి బుధవారం సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ బీమా సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొండేటి రాంబాబు (33) అనారోగ్యంతో మరణించగా ఆయన భార్య సత్యవతికి బీమా మొత్తం రూ.లక్ష కాగా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును సర్పంచ్ ఊర్మిళాదేవి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, వెల్ఫేర్ అసిస్టెంట శ్రీలక్ష్మి, వాలంటీర్ భీమవరపు నరేష్, కొండేటి రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్ విజయంపై ఉత్సవాలు

చంద్రయాన్-3 విజయవంతం నేపథ్యంలో పలుచోట్ల ఉత్సవాలు జరుపుకున్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సిబ్బందితో కలిసి చంద్రయాన్ను వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కలల్ని, ఆశయాలను నిజం చేస్తూ చంద్రునిపై ల్యాండింగ్తో సరికొత్త చరిత్రను భారతదేశం సృష్టించిందన్నారు. జిల్లా కలెక్టర్ సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నూపుర్ అజయ్, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** ర్యాలిలో విజయోత్సవాలు నిర్వ హించారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులను శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ పంపిణీ చేసింది. అనంతరం పెద్ద జాతీయ జెండాతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. **మండపేట** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం వీక్షించారు. ద్వారపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఇఒ రామచంద్రరావు విద్యార్థులతో కలిసి వీక్షించారు. **కాట్రేనికోన** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు.


అమలాపురంలో స్వీట్లు పంచుతున్న కలెక్టర్

నరసింహారావు ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కరటూరి నరసింహారావు తనపై చేసిన ఆరోపణలు అవాస్తమని ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు అన్నారు. బుధవారం వాడపల్లి వెంకటేశ్వర ఆలయ అన్నదాన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛైర్మన్ పదవి ఇవ్వడానికి ఎంఎల్ఎకు ఏదో డబ్బులు బాకీ ఉన్నట్టు, ఈ పదవి ఇవ్వడం వల్ల ఆ బాకీని రద్దు పరచినట్టు చేసిన ఆరోపణలు ముమ్మాటికీ అవాస్తవం అన్నారు. దేవస్థానం అభివృద్ధిక ఎంతో కృషి చేస్తున్న ఎంఎల్ఎపై ఆరోపణలు చేయడం చాలా బాధాకరమన్నారు. ఈ సమావేశంలో వాడపల్లి సర్పంచ్ పోచిరాజు బాబూరావు, ధర్మకర్త మండలి సభ్యులు మెర్ల వెంకటేశ్వరరావు, కనకారావు, సురేష్ రాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ రాజు

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆలమూరు

అపరిచితుల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ఇన్ఛార్జి అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి దీపా దైవ కృప అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరు శ్రీబొబ్బా జయశ్రీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సులో భాగంగా బాలికలకు 'గుడ్ టచ్, బాడ్ టచ్'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అపరిచితుల మాయ మాటలు నమ్మవద్దన్నారు. సమాజంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మహిళలకు గల ప్రత్యేక చట్టాలను ఆమె బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పి.వెంకటలక్ష్మి, న్యాయవాదులు కె.భీమశంకర రావు, కె.సునీల్కుమార్, ఎస్కె.షరీఫ్, కె.ధనరాజు, బి.మహేశ్వర రావు, సిహెచ్.సతీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి దీపా దైవకృప

'శ్రీనివాస'లో డిప్లమో తరగతులు


ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాలలో 2023 - 2024 విద్యా సంవత్సరపు డిప్లమో (పాలిటెక్నిక్) మొదటి సంవత్సరము తరగతుల్ని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ బుధవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్వి. ఎస్.పరమేశ్వరరావు, రమేష్ రాజు, సందీప్, బాబ్జి, జయలక్ష్మి, రత్నరాజు, బాపి రాజు, అరుణకుమార్ పాల్గొన్నారు.

సమస్యలపై అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-మండపేట

తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు అంగన్వాడీ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రాట్యుటీ అమలు, ముఖ్యమంత్రి హామీ మేరకు తెలంగాణ కన్నా వేతనాలు అదనంగా ఇవ్వాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందిస్తున్నామని తెలిపారు.




టంగుటూరి ప్రకాశంకు ఘన నివాళి


ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం కలెక్టరేట్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ సిహెచ్జసత్తిబాబు, ఎఒ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. **మండపేట** తాపేశ్వరం పంచాయతీ కార్యాలయంలో ఎంపిడిఒ ఐదం రాజు, సర్పంచ్ వాసంశెట్టి రాజరాజేశ్వరి, పాఠశాల హెచ్ఎం ముత్యాల మాణిక్యాంబ టంగుటూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు చుక్కాని సుబ్బరాజు, పరిపాలనా అధికారి విఎన్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు ఎన్ రామ్మోహనరావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, శేషారత్నం, విఆర్ఒలు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పిటిసి బోణం సాయిబాబా, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎఒ టివి.సురేంద్ర ఘనంగా నివాళులర్పించారు. **కొత్తపేట** ఎంపిపి మార్గాన గంగాధర రావు, గొల్లపల్లి డేవిడ్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, అవిడి సర్పంచ్ రెడ్డి రామ వెంకట సుబ్రహ్మణ్యం, సలాది బ్రహ్మాజీ పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.రామకృష్ణారెడ్డి ఘన నివాళులు అర్పించారు. సూపరిండెంట్ ప్రకాష్ పాల్గొన్నారు.


మండపేటలో..


కొత్తపేటలో..


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

స్కీమ్ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

స్కీమ్ వర్కర్లకు పని ఒత్తిడి తగ్గించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. గొల్లవిల్లిలో కె.వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లను సాయంత్రం నాలుగు గంటల వరకు పిహెచ్సిలలో ఉండాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, అంగన్వాడీలు లేనిపోని యాప్ల వల్ల ఇబ్బందులు గురవుతున్నారని, పారిశుధ్య కార్మికులకు నాడు నేడు నిర్మాణం పనులు చేయించుకుంటూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు స్కూలు ఆవరణలో ఉండాలని అధికారులు వేధిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో పి.బేబీ గంగా రత్నం, పి.ప్రసాద్, సుబ్బలక్ష్మి, బాలామణి కృష్ణవేణి, తులసి, మంగాదేవి పాల్గొన్నారు.

వల్లూరులో టిడిపి మహాశక్తి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరులో బుధవారం టిడిపి భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు టిడిపి నాయకులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రకటించిన టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. విత్తనాల వాణిశ్రీదేవి, షేక్ వల్లి జాని, శిరంగి జ్యోతి, సాధనాల దుర్గ భవాని, డి.వీరలక్ష్మి, వి.వరలక్ష్మి, ఎం.విజయ కుమారి, పి.హైమావతి, అనంతలక్ష్మి, వి.పద్మ, అల్లం సత్యవతి, వల్లూరి జానకిరత్నం, చల్లా తులసి, ముత్యాల పద్మ, గుణ్ణం బాపిరాజు, పుచ్చల శ్రీనివాస్, ముత్యాల వెంకటరావు పాల్గొన్నారు.

హత్య కేసు కొట్టివేతపై ఆందోళన

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం రూరల్ విరవాడలో 2012లో పట్టపగలు రాజకీయ కారణాలతో జరిగిన జంట హత్య కేసులో సాక్షాధారాలు బలంగా ఉన్నప్పటికీ కేసును కొట్టివేయడంతో ఆగ్రహించిన మతుల బంధువులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కొందరు శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి నచ్చజెప్పడంతో కొంత సేపటికి పరిస్థితులు సద్దుమణిగాయి. అడపా భీమరాజుర, పెదిరెడ్ల వెంకటేశ్వరరావు నాటి ఘటనలో హత్యకు గురైన విషయం విదితమే.



ఆవేదన వ్యక్తం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఈ సందర్భంగా అడపా భీమరాజు కుమారుడు, ఎంపిటిసి సభ్యులు అడపా రఘు, పెదిరెడ్ల వేంకటేశ్వరరావు భార్య అచ్చివేణి తదితరులు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 2012 జూన్ 10న అప్పటి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమరాజును రాజకీయ వైరుధ్యాలు ఉన్న నేపథ్యంలో దారి కాసి హతమార్చడానికి ప్రయత్నించారు. అడ్డుకోబోయిన పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావును, పోతుల వీరభద్రరావుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో అడపా భీమరాజుతోపాటు పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మరణించారన్నారు. పోతుల వీరభద్రరావు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఈ కేసును న్యాయమూర్తి కొట్టివేశారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న కురాకుల పుల్లయ్య కేసు కొట్టివేసిన తర్వాత సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా



రోడ్డుపై బైటాయించిన ఆందోళనకారులు

పోస్టులు పెట్టడంతో మృతుని బంధువులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయాల పాలైన ప్రత్యక్ష సాక్షి పోతుల వీరభద్రరావు సాక్ష్యం చెప్పినా కేసు కొట్టి వేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సెట్రాజ్ ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని సత్యకళావాహినిలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక విభాగంలో జానపద నత్యం(గ్రూపు, సోలో), జానపద గేయాలు(గ్రూపు, సోలో), జీవన నైపుణ్యంలో కథా రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ, ఉపన్యాసం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. జెసి ఎస్.ఇలాక్కియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ సిఇఒ కె.శ్రీరమణి, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పలస్వామి, సెట్రాజ్ మేనేజర్ కెఎస్‌వి.కాశీవిశ్వేశ్వరరావు, న్యాయ నిర్ణేతలు, సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



జెసి ఇలాక్కియాను సత్కరిస్తున్న సెట్రాజ్ అధికారులు

విజేతలు వీరే..

జానపద నత్యం (గ్రూపు)లో భవ్య గ్రూప్ ప్రథ, యామిని గ్రూప్ ద్వితీయ స్థానం, మధు గ్రూప్ తతీయ స్థానం సాధించాయి. జానపద నృత్యం (సోలో)లో పి.జాహ్నవి, ఎస్.దేవితేజస్వి, టి.లక్ష్మీశ్రావణి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జానపద గేయాలు(గ్రూపు)లో లావణ్య గ్రూప్ ప్రథమ స్థానంలో నిలిచింది. జానపద గేయాలు సోలోలో ఆర్.సాయిప్రసీద ప్రథమ, వివివిఎస్ఎస్ఎస్.హరిణి ద్వితీయ, వి.సాహితి తతీయ స్థానంలో నిలిచారు. కథా రచనలో జి. దవీత్, పోస్టర్ తయారీలో మహ్మద్ సమీర్, ఫోటోగ్రఫీలో బి.శైలేంద్రకుమార్, ఉపన్యాసంలో ఎన్.కుందన్‌సుష్మాసాయి, ఇ-గవర్నెన్స్‌ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎన్. కుందన్ సుష్మాసాయి, యాప్‌లలో ఎస్.పావనిగాయత్రి, పర్యావరణ రక్షణపై వ్యాస రచన పోటీలలో పి. మనోహర్ విజేతలుగా నిలిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం ఏటుపట్టు గ్రామాల్లో లబ్ధిదారులందరికీ ఆయా ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం బందం విజ్ఞప్తి చేసింది. ఏలేరు పరివాహక ప్రాంతంలోని 11 గ్రామాలకు సంబంధించి 1,980 మంది ఇల్లు లేని లబ్ధిదారులకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశంమెట్ట సమీపంలో మూడేళ్ల క్రితం ఇచ్చిన ఇళ్ల పట్టాల ప్రాంతాన్ని బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం పట్టాలిచ్చిన ప్పటికీ నేటికీ ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. లబ్ధిదారులందరూ వారి సొంత గ్రామాలలో వ్యవసాయ పనులు చేసుకుంటారన్నారు. వారందరికీ 18 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల పట్టాలు ఇస్తే ఎన్నో అవస్థలు పడతారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తోటపేటలో 'గడప గడపకూ...'

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు పంచాయతీ తోటపేట, బిసి పేట, పోలేరమ్మ గుడి ప్రాంతంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. తోటపేటలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డుకు ఇరుపక్కల గ్రావెల్ వేయాలని ప్రజలు కోరారు. వెంటనే ఎంఎల్ఎ కాంట్రాక్టర్‌తో మాట్లాడి గ్రావెల్ వేయాలని ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు అందించాలని మహిళలు కోరారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మారుతీరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధా, ఎంపిటిసి సభ్యులు బల్ల సంధ్యారాణి, ఎంపిపి రాయుడు సునీత, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్, ధూళిపూడి బాబి, కొపనాతి నాగరాజు, దున్నా శ్రీకాంత్, భూసారపు పద్మారావు, ఉప సర్పంచ్ దడాల గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డి ప్రసాద్‌కు పలువురి పరామర్శ

చాగల్లు : కడియం పోలీసులు దాడిలో గాయపడిన కుంకుడుమిల్లికి చెందిన వడ్డే వెంకట ప్రసాద్‌ను జనసేన పార్టీ నాయకులు టివి.రామారావు బుధవారం పరామర్శించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి కారకులను కఠినంగా శిక్షించాలని రామారావు డిమాండ్ చేశారు.

అన్నవరం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- చాగల్లు

ఊనగట్లకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొండేపర్తి అన్నవరం మాతృమూర్తి మరణించడంతో పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి టివి.రామారావు అన్నవరం కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఊనగట్ల నాయకులు ఏపుగంటి వెంకన్న, ఏపుగంటి నాగబాబు, కొయ్యలమూడి తేజ, బొరుసు శ్రీను, బొరుసు మణికంఠ, చాగల్లు నాయకులు కనాజీ రామాంజనేయాలు, రాగిరెడ్డి దుర్గ భూషణం, బిక్కిన సురేష్ చౌదరి, రాంబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు

సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో సిఎస్ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ బుధవారం తెలిపారు. ఈ మేరకు సిఎస్ఆర్ నిధులు మంజూరు చేసేందుకు సిఎస్ఆర్ కమిటీ ఆమోదించిందన్నారు. 18 పనులకు సంబంధించి రూ.2.47 కోట్లు, 33 అభివద్ధి పనులకు సంబంధించి రూ.19.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా మరికొన్ని పనులకు రూ.2.30 కోట్లు ఇవ్వడానికి సిఎస్ఆర్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. గతంలో చేపట్టిన నిరవధిక దీక్ష వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ భూమి పట్టాదారులకు త్వరలో ఒఎన్‌జిసి నష్టపరిహారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప గ్రామంలో ఉన్న ఎస్‌సి ఫీల్డ్ లేబర్ సొసైటీ భూమి పట్టాదారులకు ఒఎన్‌జిసి ద్వారా రావాల్సిన నష్టపరిహారం త్వరలో మంజూరు చేయనున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ మేరకు పెండింగ్లో ఉన్న సుమారు 19 మంది పట్టాదారులకు నష్టపరిహారం త్వరలో తమ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు.

టిడిపితో మహిళలకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపితోనే మహిళలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టిడిపి నిర్వహిస్తున్న భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి చైతన్య రథయాత్రను 26వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటా తిరిగారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే టిడిపి ప్రభుత్వంలో మహిళల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకాలను ప్రకటించారన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, రక్షణ టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగి, రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, చిక్కాల సత్యవతి, అన్సార్, పంతాడి రాజు, సంఘాని నాగూర్, చింతా పేర్రాజు, సంఘాని గంగాధరం, కొల్లు ప్రకాష్, సంఘాని నూకరాజు, ఆదినారాయణ, పాలెపు రాజు పాల్గొన్నారు.

హౌసింగ్ రుణాలపై నిలదీత

ప్రజాశక్తి -కరప

హౌసింగ్ రుణాలు అందించకపోవడంపై పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. కరప మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ చంద్రన్న సమావేశం భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపిడిఒ కె.అప్పారావు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాతర్లగడ్డ సర్పంచ్ వాసిరెడ్డి ఏసుబాబు మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం అందట్లేదని తెలిపారు. దీనిపై అధికారులను నిలదీశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ 'సాయం విషయమైన ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వొద్దని, హౌసింగ్ అధికారులను సంప్రదించాలి' అని అన్నారు. దీంతో సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సర్పంచులను సమావేశపరిచి హౌసింగ్ రుణాలు ఇస్తారు, ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారన్నారు. ఇప్పుడు అధికారులను సంప్రదించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, ఎంఇఒ బులి కృష్ణవేణి, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఎఇ ఈశ్వర్‌ప్రసాద్, అగ్రికల్చర్ ఎఇ రాజేష్ పాల్గొన్నారు.

టిడిపి అసత్య ప్రచారాలు తగదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వేమవరంలో ఈనెల 22న మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నవారంతా వైసిపికి చెందిన వారేనని చేస్తున్న ప్రచారం సత్య దూరమని జడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత, నరేష్ దంపతులు తదితరులు తీవ్రంగా ఖండించారు. బుధవారం పి.వేమవరంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముసిరెడ్డి రాంబాబు, ముసిరెడ్డి శ్రీరాములు ఇద్దరూ స్థానిక ఎన్నికల్లో జనసేన తరఫున పనిచేశారన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సమావేశంలో ప్రదర్శించారు. వైసిపికి చెందిన వెయ్యి మంది టిడిపిలోకి చేరినట్లు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో సర్పంచి ఎలిశెట్టి నూకరత్నం, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్న దొర, ఎంపిటిసి సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గొల్లపల్లి వితరణ

కడియం : కడియం జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, తన తల్లి గొల్లపల్లి నూకమ్మ జ్ఞాపకార్థం వసతిగృహం విద్యార్థులకు రూ.6 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు. పదో తరగతి విద్యార్థి హేమకు సైకిల్‌ను బహూకరించారు. అత్యధిక మార్కులు సాధించిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. పాఠశాల ఆయమ్మలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గొల్లపల్లి దంపతులను పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజు, డేవిడ్, సువర్ణవేణి, గిరిజ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పూర్తికి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట జగనన్న లే-అవుట్‌లో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిర్దేశించిన పనులన్నింటినీ ఈనెల 28 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక జి.రాగంపేట రోడ్డులోని ఇటిసి లేఔట్‌లో గృహ నిర్మాణాలు, ఇతర పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ శాఖల సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఈ పనులను ఆయా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పలు సూచలను చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్‌పట్నాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డిఒ ఎన్‌విని.సత్యనారాయణ, డిఎల్‌డిఒలు పి.నారాయణమూర్తి, ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. స్థానిక 9వ వార్డు పరిధిలోని పద్మనాభ కాలనీలో బుధవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైస్ చైర్మన్ స్పందిస్తూ ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పి.సత్తిబాబు, టి.సత్యభాస్కరరావు, వి.రాజా, ఎ.వీరరాఘవ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణ, జీవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహనను పెంపొందించుకోవాలని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. బుధవార బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను హెచ్ఎం, ఎస్ఐ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ టివి.రత్నం, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేటలో ఈనెల 17న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అన్నదేవరపేట గ్రామానికి చెందిన జాలే బంగారాజు ఇంట్లో బంగారు నగలు, నగదు చోరీకి గురైంది. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోది చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన బాలగంగాధర్ ఆకాశపు సతీష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరి నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారు నగరలు, రూ.70వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కొవ్వూరు కోర్టుకు తరలించామన్నారు.

కోడిపందెం ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో పేరవరం శివారు కోడిపందేలు అడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ పేరవరంలోని కోడిపందేలా శిబిరంపై దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేవారు. వారి నుంచి రూ.1,090 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఉద్యోగి చేతివాటంపై విచారణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ జి.రాగంపేట రోడ్డులోని జగనన్న లే అవుట్‌లో జగనన్న ఇళ్లకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వడంలో విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. విద్యుత్ కనెక్షన్ల విషయంలో పలు అవకతవకలకు పాల్పడినట్టు అధికారులకు ఫిర్యాదులందాయి. లబ్ధిదారులకు ఎటువంటి డిపాజిట్ లేకుండానే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినా అందుకు విరుద్ధంగా సామర్లకోటలో విద్యుత్ శాఖ ఉద్యోగి విద్యుత్ కనెక్షన్ కోసం లబ్ధిదారుల నుంచి రూ.వేయి చొప్పున వసూలు చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికలో సదరు ఉద్యోగికి పెద్ద మొత్తంలో ఫోన్ పేల ద్వారా సొమ్ములు చెల్లించినట్లు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించి సంబంధిత ఉద్యోగిపై తదుపరి చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు సమాచారం.

ఇథనాల్ ఫ్యాక్టరీపై సుమోటో కేసు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై సుమోటో కేసు నమోదు చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ తెలిపారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. నియోజవర్గంలో కాలుష్యాలు నుంచి ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేసే అసాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల 30 నుంచి 50 కిలో మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు, ప్రాణ వాయువు కలుషితమవుతుందన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో 281/2023, 98/2023 నుంబర్లతో కేసు నమోదైందన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలతో పోరాడే శక్తి ప్రజలే అందించాలని నియోజక వర్గంలో ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు నెలలో ఒక్క రోజు పని దినాన్ని కాంగ్రెస్ పార్టీ పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర కోసం కేటాయించాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - పెదపూడి

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యమని, మహానాడులో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన రాజుపాలెంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తుందన్నారు. అసలైన సంక్షేమం టిడిపితోనే సాధ్యమని వెల్లడించారు. ప్రత్యేకించి మహిళలకు మహాశక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శేషారత్నం, మండల అధ్యక్షులు సత్యవతి, డ్వాక్రా, అంగన్‌వాడీ సాధికారిక కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాషిణి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధరచౌదరి, టిడిపి మండల అధ్యక్షులు జుత్తుక కృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు,

ప్రశాంతంగా మండల సమావేశం

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రశాంతంగా సాగింది. ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపిడిఒ గోవింద్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పనుల పురోగతిని సభ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఎఒ ఈశ్వరరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో వరి సాగు చేపట్టే పరిస్థితి లేదన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై అపరాలు అందజేసేందుకు ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు. ఎంఇఒ అడిగర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ పనులను ముమ్మరం చేశామన్నారు. విద్యుత్ శాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య ఉందని, దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామనానరు. అలాగే పలు శాఖల అధికారులు పనుల వివరాలను సభ సభ దృష్టికి తీసుకొచ్చారు